ప్రజాశక్తి

ఆదివారం 7 డిసెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

గెలిచిన భారత్.. మురిసిన విశాఖ

◆ నిర్ణయాత్మక మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన జైస్వాల్ ◆ అర్ధ సెంచరీలతో అలరించిన రోహిత్, కోహ్లీ

◆ అంతిమ పోరులో దక్షిణాఫ్రికాకు నిరాశ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో విశాఖ వేదికగా శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు ఓపెనర్ యశస్వి జైస్వాల్ 121 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌ల సహాయంతో 116 పరుగుల అజేయ సెంచరీతో చెలరేగగా మరొక ఓపెనర్ రోహిత్ శర్మ 73 బంతులలో 7 ఫోర్లు, మూడు సిక్స్‌ల సాయంతో 75 పరుగులు చేశాడు. అనంతరం వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన విరాట్ కోహ్లీ 45 బంతుల్లో 6 ఫోర్లు, మూడు సిక్స్‌ల సాయంతో 65 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యశస్వి జైస్వాల్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

జైస్వాల్ విజయ గర్జన

క్రీడాభిమానులతో కిక్కిరిసిన ఎసిఎ - విడిసిఎ మైదానం

తొలుత డి కాక్ శతక విన్యాసం

దక్షిణాఫ్రికా జట్టు తరఫున స్టార్ ఆటగాడు క్వింటన్ డి కాక్ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శనతో 106 పరుగులు చేసి అలరించాడు. అతని ఇన్నింగ్స్ ప్రత్యర్థి బౌలర్లకు సవాలుగా మారింది. అయితే, తోటి ఆటగాళ్ల నుంచి అతనికి సహకారం కొరవడింది. దీంతో ఆ జట్టు 270 పరుగులకే ఆలౌట్ అయింది.

కోహ్లీ, రోహిత్ మానియా

టీమ్ ఇండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మను చూడటానికే ఎక్కువ మంది ఈ మ్యాచ్‌కు విచ్చేశారు. వైజాగ్ స్టేడియం కోహ్లీకి అత్యంత కలిసొచ్చిన మైదానాల్లో ఒకటి. అందుకు తగ్గట్టుగానే అతడు శనివారం మిగతా 2లో..

సరుకు రవాణాలో
పోర్టు సరికొత్త రికార్డు

249 రోజుల్లోనే 60 మిలియన్ మెట్రిక్ టన్నుల నిర్వహణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సరుకు రవాణాలో విశాఖపట్నం పోర్టు అథారిటీ సరికొత్త మైలురాయిని నెలకొల్పింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 249 రోజుల్లోనే 60 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును నిర్వహించి సరికొత్త రికార్డును లిఖించింది. గతంలో ఇదే మైలురాయిని చేరుకోవడానికి విశాఖ పోర్టుకు 2024 - 25లో 273 రోజులు, 2023 - 24లో 275 రోజులు సమయం పట్టింది. ఈ నూతన రికార్డు సరుకు రవాణాలో విశాఖపట్నం పోర్టు సామర్థ్యానికి అద్దం పడుతోందని అధికారులు తెలిపారు.

సరికొత్త పంథా

సరుకు రవాణాలో పోర్టు అవలంబిస్తున్న నూతన విధానాలకు పోర్టు ఉద్యోగుల నిబద్ధత, వినియోగదారుల సంతృప్తి తోడయ్యాయని పోర్టు చైర్మన్ అంగముత్తు తెలిపారు. ఈ సందర్భంగా అందరినీ అభినందించారు. ప్రాంతీయ వాణిజ్య అభివృద్ధి సౌలభ్యం వంటి అంశాలలో పోర్టు పోషిస్తున్న పాత్రను తెలియజేశారు.

సవాళ్లను అధిగమించి..

ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యంలో జరుగుతున్న మార్పులు, మౌలిక వసతుల సవాళ్లను అధిగమించి ప్రత్యామ్నాయ సరుకు రవాణాపై దృష్టి సారించి పోర్టు ఈ ఘనతను సాధించింది. మౌలిక వసతులు కల్పించడం, వివిధ విభాగాల సామర్థ్యాలను పెంచడం, వాణిజ్య భాగస్వాముల సమన్వయంతో పనితీరును నిరంతరం మెరుగుపరచుకోవడం ద్వారా పోర్టు ఈ ఘనత సాధించింది. రికార్డు సరుకు రవాణా పట్ల చైర్మన్ ఎం.అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనతలో భాగస్వాములైన పోర్టు సిబ్బంది, టెర్మినల్ నిర్వాహకులు, పోర్టు వాణిజ్య భాగస్వాములకు అభినందనలు తెలిపారు. ఈ ఘనత పోర్టు సిబ్బంది అంకిత భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. పోర్టు డిజిటలైజేషన్, గ్రీన్ పోర్టు కార్యకలాపాలను నిరంతరం కొనసాగిస్తామని అన్నారు.

కెజిహెచ్‌లో కిడ్నీ మార్పిడి విజయవంతం
▸ వార్త 2లో..

కాగడాలతో గిరిజనుల నిరసన
▸ వార్త 8లో..

అట్టహాసంగా ‘నాట్యం’ రజతోత్సవం
▸ వార్త 2లో..

కాన్వెంట్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న అధికారులు

మహనీయుడు అంబేద్కర్

పలుచోట్ల ఘనంగా వర్ధంతి వార్తలు 7లో..

సమర్థవంతంగా ఓటర్ల జాబితా మ్యాపింగ్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడటానికి కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాల ప్రకారం జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. ముందస్తు ఎస్ఐఆర్ నేపథ్యంలో బాధ్యతగా వ్యవహరించాలని, ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాయుతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. శనివారం ఆయన కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇఆర్ఒలు, ఎఆర్ఒలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై సూక్ష్మంగా సమీక్షించిన ఆయన ఓటర్ల జాబితా విధానంలో భాగంగా నిర్వహించే మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాలో వారి పేర్లు, తండ్రి, తల్లి పేర్లను ధ్రువీకరించడానికి 2002 సంవత్సరం ఓటరు జాబితాను పరిశీలనలోకి తీసుకోవాలన్నారు. 2002 జాబితాను 2025 నాటి జాబితాతో సరిపోల్చి వివరాలను నమోదు చేసుకోవాలని, ఆయా పోలింగ్ స్టేషన్, నియోజకవర్గం వారీగా ఓటర్ల వివరాలను మ్యాపింగ్ చేయాలని సూచించారు. స్వీయ పత్రాల స్వీకరణ, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శక రీతిలో జరిగేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అప్రమత్తంగా ఉంటూ ప్రక్రియను సజావుగా చేపట్టాలన్నారు.

మాట్లాడుతున్న వివేక్ యాదవ్

జిల్లాలో 24.54 శాతం మ్యాపింగ్

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ప్రక్రియలో భాగంగా ఇప్పటి వరకు 24.54 శాతం మ్యాపింగ్ జరిగిందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సిఇఒకు వివరించారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 20,20,726 మంది ఓటర్లు ఉండగా 2,81,415 మంది వివరాలను మ్యాపింగ్ చేశామని, మిగిలిన ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. వారసులు, ఇతర సంతానం తాలూకా వివరాలను కూడా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గెలిచిన భారత్.. మురిసిన విశాఖ

తనదైన షాట్‌లతో అలరించాడు.

బ్లాక్ మార్కెట్ దందా

ఆన్‌లైన్‌లో టికెట్లన్నీ కొద్దిసేపట్లోనే అమ్ముడుపోవడంతో బ్లాక్ టికెట్ల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. రూ.3000 టికెట్‌ను రూ.10,000 వరకు, రూ.5,000 టికెట్‌ను ఏకంగా రూ.12,000 - 15,000 వరకు అక్రమంగా విక్రయించి పలువురు సొమ్ము చేసుకున్నారు. శుక్రవారం రాత్రి 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా శనివారం మరో 14 మంది పట్టుబడ్డారు. వారిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని పిఎం పాలెం పోలీసులకు అప్పగించారు. వారి నుంచి 17 టికెట్లను స్వాధీనం చేసుకున్నారు.

సామర్థ్యాన్ని మించి టికెట్ల అమ్మకాలు

ఎసిఎ - విడిసిఎ స్టేడియం సామర్థ్యం 28,000 అయినప్పటికీ సుమారు 35 వేల పైన టికెట్లు అమ్మకాలు జరిగాయని తెలుస్తోంది. ముఖ్యంగా టికెట్లపై సీట్ నెంబర్లు కేటాయించకపోవడం, ఫ్రీ సీటింగ్ విధానంలో ఎవరు ముందు వస్తే వారే ముందుకు వెళ్లి కూర్చోవాలని తెలియజేయడంతో అసలు ఎన్ని టికెట్లు ముద్రించారు ? ఎన్ని అమ్మకాలు జరిపారు ? అనే విషయంపై పలువురు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. స్టేడియం మొత్తం నిండిపోయినప్పటికీ చాలామంది అభిమానులు టికెట్లు చేత పట్టుకుని బయట కనిపించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇదిలా ఉండగా తమ వద్ద టికెట్లు ఉన్నా సమయం మించిపోయిందని తమను లోపలకు అనుమతించడం లేదని పలువురు అభిమానులు స్టేడియం గేట్ల వద్ద నిరసనలకు దిగారు.

సమర్థవంతంగా ఓటర్ల జాబితా మ్యాపింగ్

జాగ్రత్తగా అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. అయితే జిల్లాలో దాదాపు అన్నీ పట్టణీకరణ ప్రాంతాలే కావటం, వలస కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల వివరాల సేకరణలో క్షేత్రస్థాయిలో కొంచెం క్లిష్టత ఏర్పడుతోందని ఇఆర్‌ఒలు సిఇఒ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఇఆర్‌ఒలు సంగీత్ మాధుర్, దయానిధి, సుధాసాగర్, మధుసూదన్, సునీత, శేషశైలజ, జ్ఞానవేణి, పలువురు ఎఇఆర్‌ఒలు పాల్గొన్నారు.

గూగుల్ ఒప్పందాన్ని బహిర్గతం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.15 బిలియన్ డాలర్ల గూగుల్ డేటా సెంటర్ అవగాహనా ఒప్పందం వివరాలను వెంటనే బహిరంగపరచాలని హ్యూమన్ రైట్స్ ఫోరమ్, యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్‌టిఐ క్యాంపెయిన్ సంస్థలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా హ్యూమన్ రైట్స్ ఫోరమ్ మెంబెర్ విఎస్.కృష్ణ, యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్‌టిఐ క్యాంపెయిన్ కో- కన్వీనర్ బుద్ధా చక్రధర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 'గేమ్-ఛేంజర్'గా అభివర్ణిస్తున్నప్పటికీ భూ కేటాయింపులు, ఆర్థిక రాయితీలు, నీరు, విద్యుత్ వినియోగం వంటి కీలక అంశాలపై కుదిరిన ఒప్పందాన్ని గోప్యంగా ఉంచడం సమాచార హక్కు చట్టం - 2005 స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని సంస్థలు ఆరోపించాయి. పౌరుల వనరులు పెద్ద మొత్తంలో కేటాయించబడుతున్నందున ప్రజా పరిశీలన తప్పనిసరి అని నొక్కి చెప్పాయి. దీంతో పాటు ఎపి రాష్ట్ర సమాచార కమిషన్‌లో చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పదవితో సహా ఐదు స్థానాలు ఖాళీగా ఉండటంపై ఈ రెండు సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. పారదర్శక పాలనకు నిబద్ధతను నిరూపించుకోవడానికి ప్రభుత్వం తక్షణమే ఈ ఒప్పందాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశాయి.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి- ఎంవివి.కాలనీ: భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని తూర్పు కోస్తా రైల్వేజోన్ జిఎం పరమేశ్వర్ ఫంక్వాల్ ఆదేశించారు. శనివారం ఆయన విశాఖలో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నం-గోపాలపట్నం వడ్లపూడి గేట్ జంక్షన్ మధ్య జరుగుతున్న 3వ, 4వ లైన్ల పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్దేశించిన కార్యాచరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు సకాలంలో పూర్తయ్యే లా చూడాలని అధికారులను ఆదేశించారు. సింహాచలం స్టేషన్‌ను సందర్శించి, 'అమత్‌భారత్‌స్టేషన్' పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. స్టేషన్ భవన నిర్మాణం, ఇతర వసతుల ఏర్పాటుపై ఆరా తీశారు. అనంతరం 72వ పురుషుల, 11వ మహిళల ఆల్ ఇండియా రైల్వే వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025-26 ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు 180 మంది వెయిట్‌లిఫ్టర్లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వాల్తేరు అధికారులను ఆయన అభినందించారు. విజేతలకు, రన్నరప్‌లకు ట్రోఫీలు, మెమొంటోలను అందించారు. అనంతరం జనరల్ మేనేజర్ 63వ పౌర రక్షణ దినోత్సవాలకు హాజరయ్యారు. తూర్పు కోస్తా రైల్వే , ఆగ్నేయ రైల్వే సంయుక్తంగా నిర్వహించిన పౌరరక్షణ ప్రదర్శనను తిలకించారు. డిఆర్‌ఎం లలిత్‌బోహ్రా, అధికారులు అజయ్‌సమల్, ఇ. సంతారాం, కె. రామారావు, ఎం.హరనాథ్, జుసుఫ్ కబీర్ అన్సారీ, ఆగ్నేయ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్ గుప్తా వంటి పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో స్టాల్స్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు విశాఖపట్నంలో 12 రైతుబజార్లలో ఈనెల 31 నుండి ఖాళీ అవుతున్న 25 డ్వాక్రా, 6 పిహెచ్‌సి స్టాల్స్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు సహాయ మార్కెటింగ్ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుండి 17 వరకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సహాయ మార్కెటింగ్ సంచాలకులు కార్యాలయం గోపాలపట్నం రైతుబజార్ ప్రక్కన, విశాఖపట్నం, ఫోన్: 9030819082 వారిని సంప్రదించాలన్నారు.

'గూగుల్' మల్లగుల్లాల్ !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలోని కుగ్రామం 'తర్లువాడ'లో రూ.15 లక్షల కోట్ల పెట్టుబడితో గూగుల్ రాబోతుందన్న వార్త ప్రపంచాన్ని చుట్టేసిన సంగతి తెలిసిందే. అది ఎప్పుడు వస్తుందో ? ఎలా వస్తుందో ? ఇంకా స్పష్టతే లేదుగానీ రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన అధికార తెలుగుదేశం, వైసిపి పార్టీ నాటకాలతో అంశాన్ని రక్తి కట్టిస్తున్నాయి. ఈ డేటా సెంటర్ గూగుల్‌దని టిడిపి, కాదు కాదు గతంలో తాము తేవాలనుకున్న అదాని డేటా సెంటరే అంటూ వైసిపి చెరో వాదన వినిపిస్తూ వస్తున్నాయి. కార్పొరేట్ల కోసం పోటీపడే ఈ రెండు పార్టీలు ఈ డేటా సెంటర్‌తో ప్రజలకు లాభం ఉందా? అనే కోణంలో పోట్లాడుకోవడం లేదు. పైగా 'ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం' అన్నట్టుగా పెద్ద ఎత్తున ఈ డేటా సెంటర్‌పై హడావుడి నడుస్తోంది. ఇప్పటికీ భూ నష్టపరిహారం తేలనే లేదు. ప్రజలంతా సంసిద్ధత తెలియజేయనేలేదు. ఇంకా పర్యావరణ సమస్యలపై ప్రభుత్వం స్పష్టతే ఇవ్వలేదు. అంతకు మించి గూగుల్ సంస్థ రావాలంటే రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ కుదుర్చుకున్న ఒప్పందం అసలు రూపం దాల్చనే లేదు. అయినప్పటికీ ప్రచారం హోరెత్తుతోంది.

అదానీ డేటా సెంటర్‌పై ఎవరికి వారే..

జగన్ గూగుల్‌పై మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్ అంటే అదానీదేనని చంద్రబాబు లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆ క్రెడిట్ అంతా తమదంటూ చెప్పుకోవడం కనిపిస్తోంది. టిడిపి నేతలు అసలు అదానీ డేటా సెంటర్‌కు 2023లో జగన్ శంకుస్థాపన చేయడానికి నాలుగేళ్ల ముందే అంటే 2017లోనే సిఎం చంద్రబాబు ఓకే చెప్పారంటూ ప్రచారం తాజాగా అందుకోవడం విశేషం. కాపులుప్పాడలో 500 ఎకరాలు స్థలం ఇవ్వడానికి రూ.70 వేల కోట్ల పెట్టుబడి పెట్టి 5 గిగావాట్ల సామర్థ్యంతో

హైపవర్ స్కేల్ డేటా సెంటర్ సోలార్ ప్లాంట్ ఒకటి నిర్మించడానికి చంద్రబాబు ఒప్పందం చేసుకున్నట్లు చెబుతున్నారు. 2019లో జగన్ ఎన్నికల్లో గెలిచి సిఎం అయ్యాక డేటా సెంటర్‌కు మోకాలడ్డారని టిడిపి చెబుతోంది. కాపులుప్పాడలో ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవడంతో అదాని తన పెట్టుబడిని రూ.70 వేల కోట్ల నుంచి 14 వేల కోట్లకు పరిమితం చేసుకోవడం, 11 లక్షల ఉద్యోగాల నుంచి 25 వేల ఉద్యోగాలే ఇస్తానని కుదించేయడం జరిగిందంటూ టిడిపి ప్రచారం చేస్తోంది. పనోరమ హిల్స్ వద్దగల రుషికొండ హిల్ నెంబర్ 3పై జగన్ ప్రభుత్వం 190 ఎకరాలు ఇచ్చిందని చెబుతూ అప్పట్లో అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. గూగుల్ డేటా సెంటర్‌కు, అదానీ డేటా సెంటర్‌కు సంబంధం లేదని, గూగుల్ సంస్థ పనులను విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ గూగుల్ అనుబంధ సంస్థ నిర్వహిస్తుందంటూ టిడిపి చెబుతోంది. ఇక్కడ అడ్డంగా ఈ పార్టీ దొరికింది. ఇదే రైడెన్‌కు అదానీకి మధ్య వ్యాపార లావాదేవీలు ఉండడంతో వైసిపి గూగుల్ కాదు అదానీ అంటూ చెబుతోంది. అదాని కూడా గూగుల్‌పై స్పందిస్తూ గూగుల్‌తో భాగస్వామిగా ఉన్నామంటూ రెండు నెలల క్రితమే ప్రకటించడం టిడిపి నోట్లో పచ్చివెలక్కాయ పడినట్టయింది.

ఏదిఏమైనా అదానీ లేదని, ఆ కథ వేరు.. కొత్త కథ ప్రకారం గూగుల్ సొంతంగా ఇండియాలో విశాఖనే ఎంచుకుందంటూ తెలుగుదేశం పార్టీ చెప్పడం చూస్తుంటే మొత్తానికి ఒక గూగుల్, ఒక అదానీ కోసం ఇరు పార్టీలు ఎలా పోటీపడుతూ ప్రజల ప్రయోజనాలను తాకట్టుపెట్టేందుకు సిద్ధం అవుతున్నాయన్నది ఈ వ్యవహారం పట్టిచూపుతోంది.

కెజిహెచ్‌లో కిడ్నీ మార్పిడి విజయవంతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ కెజిహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగంలో ఓ మహిళ కిడ్నీ మార్పిడి ప్రక్రియ విజయవంతమైంది. వివరాల్లోకి వెళ్తే.. గత నెలలో డి.జయలక్ష్మి క్రానిక్ కిడ్నీ డిసీజ్‌తో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. ఆమెను పరీక్షించిన వైద్యులు కిడ్నీ మార్పిడి చేసుకోవాలని సూచించారు. అత్త డి.పాపమ్మ జయలక్ష్మికి కిడ్నీ దానం చేయడానికి ముందుకు వచ్చింది. ఈ క్రమంలో వైద్యులు కిడ్నీ మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. దాత, గ్రహీత సంపూర్ణంగా కోలుకొని శనివారం ఆసుపత్రి నుండి డిశ్చార్జి అయ్యారు. ఇప్పటి వరకు సెకండ్ డిగ్రీ ట్రాన్స్లేషనేషన్ ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ జరగలేదని, ప్రప్రథమంగా కెజిహెచ్‌లో ఈ సేవను అందించడం గర్వకారణమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. నెఫ్రాలజీ విభాగం సేవలను వినియోగించుకోవలసిందిగా ప్రజలను కోరారు.

ఈ సేవలను అందించినందుకు నెఫ్రాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రత్నప్రభ, యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఐ.చంద్రశేఖర్, ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలక్ష్మి, ఎనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ జివి.గణేష్, ఇతర నర్సింగ్ సిబ్బందిని డాక్టర్ వాణి అభినందించారు.

ప్రకృతి ఉత్పత్తులకు చేయూత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: సేంద్రియ రైతులు రాష్ట్రానికి ఉన్న ఆస్తి అని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రకృతి పంటల మేళాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేట్, సంయుక్త కార్యక్రమం ద్వారా చాలా ప్రాజెక్ట్స్ ముందుకు తీసుకు వెళు_న్నామన్నారు. గ్రామీణ రైతుల ఎఫ్ పిఒల ద్వారా గ్లోబల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వాణిజ్య పన్నుల డివిజన్ సంయుక్త కమిషనర్‌గా వల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: వాణిజ్య పన్నుల శాఖ విశాఖపట్నం ఒకటో డివిజన్ సంయుక్త కమిషనర్‌గా పి.బి.వల్లి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఆమె అనంతపురం ఉపకమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వల్లిని డివిజన్ పరిధిలో సహాయక కమిషనర్లు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వల్లి అధికారులకు 2025-26 ఆర్థిక సంవత్సరం పన్నుల లక్ష్య సాధనకు ప్రణాళికను వివరించారు. జిఎస్‌టి సంస్కరణలు, పన్నుల రాబడి దృష్ట్యా విశాఖ ఒకటో డివిజన్ కీలకమైనదన్నారు.

ఉప కమిషనర్‌గా ఎం.హరీష్‌కుమార్

వాణిజ్య పన్నులశాఖ, విశాఖపట్నం ఒకటో డివిజన్ ఉప కమిషనర్‌గా ఎం.హరీష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రీజనల్ జిఎస్‌టి ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్, సహాయక కమిషనర్‌గా పనిచేస్తున్న హరీష్‌కుమార్ పదోన్నతిపై ఉప కమిషనర్‌గా విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

అట్టహాసంగా 'నాట్యం' రజతోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని సీతమ్మధారకు చెందిన 'నాట్యం' నాట్య కళాక్షేత్ర సంగీత, నృత్య సంస్థ 25 వసంతాల వేడుక కళాభారతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం కన్నుల పండువగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.మాధవి, నిర్వాహకులు వెంకట్ నేతృత్వంలో విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన 'నాట్యాంజలి', భరతనాట్య కచేరీ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. కృతులకనుగుణమైన హావభావాలతో నాట్యకారులు రస హృదయాలను శృతిచేయగా, ప్రేక్షకులు చప్పట్ల వర్షంతో బ్రహ్మరథం పట్టారు. ఆసాంతం ఈ కార్యక్రమం ఫక్తు భరతనాట్య సంప్రదాయ నాట్య కచేరీల బాణీలోనే సాగింది. ఈ ఉత్సవాలను ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బిఆర్.విక్రమ్ కుమార్, నాట్య కళానిధి ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం, నాట్య నిపుణులు కన్నం వి.రమణరావు, కృష్ణా విశ్వ విద్యాలయం పూర్వపు ఉప కులపతి ఎస్.రామకృష్ణారావు తదితరులు లాంఛనంగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నాట్య గురువు కె.వెంకట్ నట్టువాంగం నిర్వహణ, కె.చంద్రరావు గాత్ర సహకారం కార్యక్రమాన్ని ఆద్యంతం రసపట్టులో నడిపించాయి. టి.చైతన్య (మృదంగం), కుమార్ బాబు (వేణువు), హెచ్.రామ చంద్రన్ (వాయులీనం) అందించిన వాయిద్య సహకారం కార్యక్రమానికి ఆకర్షణగా నిలిచింది.

ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా తాళ్లపాక అన్నమాచార్య కృతి 'కంజదళయదాక్షి' కీర్తనలకు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనలు మెప్పులందుకున్నాయి. జూనియర్ చిన్నారులచేత ప్రదర్శింపజేసిన శ్లోకాలకు సంబంధించిన హస్త ముద్రలు, అభినయాలు వంటి ప్రాథమికాంశాలు ముచ్చటగొలిపాయి. డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ విరచిత తిల్లానా.. మంగళంతో ప్రదర్శనలు ముగిశాయి.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - అరిలోవ : గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.47.73 కోట్ల ఎస్ఎ-ఎస్‌సిఐ నిధులతో ముడసర్లోవ ప్రాంతం పైనాపిల్ కాలనీ, మహిళ ప్రాంగణంలో 'వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్' భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. సుమారు రెండు ఎకరాల స్థలంలో ఐదు అంతస్తుల భవన సముదాయానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, వార్డు కార్పొరేటర్లు కెల్లా సునీతసత్యనారాయణ, రామలక్ష్మిరాజశేఖర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఉద్యోగాలు చేసే మహిళలకు రక్షణ కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వ అసమర్థత వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 5 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు మంజూరు కాగా, అందులో మూడు కేవలం విశాఖ పార్లమెంట్ పరిధిలోకే రావడం విశేషమని తెలిపారు. జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, పనిచేసే మహిళలకు అందుబాటు ధరల్లో వసతి కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 18 నెలల వ్యవధిలో ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే రామకృష్ణబాబు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐటి, ఫార్మా, పారిశ్రామిక, ఇతర సేవా రంగాల్లో పనిచేసే మహిళలకు ఈ హాస్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డుల అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, ముగడ రాజారావు, గాడు అప్పలనాయుడు, సుబ్బరాజు, బుడుమూరి గోవింద్, కూటమి నాయకులు నీలి పైడిరాజు, కొండపల్లి సతీష్, తురకపూడి బాలస్వామి, పాత్రకడ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్ తదితరులు

డెమ్‌కాన్ సదస్సు ముగింపులో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్

గీతంలో ముగిసిన డెమ్‌కాన్ సదస్సు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని జిమ్‌సర్ ఆసుపత్రి వేదికగా జరుగుతున్న డెమ్‌కాన్-2025 జాతీయ సదస్సు శనివారం ముగిసింది. డిమెన్షియా నివారణ, చికిత్స, అవగాహన కోసం పనిచేస్తున్న జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థ డిమెన్షియా ఇండియా అలయన్స్, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆసుపత్రి, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్, నిమ్ హేన్సు-సెంటర్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్, ప్రభుత్వ మానసిక ఆరోగ్య సంస్థ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, దేశంలో డిమెన్షియా పట్ల అవగాహనతో పాటు బాధితలకు చికిత్స అందించే విస్తృత యంత్రాంగం అవసరమన్నారు. గీతం ఆసుపత్రిని డిమెన్షియా ఫ్రెండ్లీ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో డిఐఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణి సుందరం, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్ఎస్.రాజు, దేశంలోని వైద్యులు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు, విద్యార్థులు, ఆసుపత్రులు, వృద్ధాశ్రమాల సంరక్షకులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి -ఆరిలోవ : వైసిపి రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శిగా పతివాడ వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తను సీతమ్మధారలోని కార్యాలయంలో శనివారం ఆమె కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అందరినీ కలుపుకొని పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు వైసిపి అధ్యక్షుడు పతివాడ కనకరాజు, రవీంద్ర చౌదరి, గురునాయుడు, ఎంఎన్.మూర్తి, అబ్దుల్ రావుఫ్, శశికుమార్, రవికుమార్, దేవి, జయశ్రీ, పుణ్యవతి, సత్యవతి, శ్రీదేవి, ఇప్పిలి పార్వతి, జ్యోతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరికృష్ణ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.హరికృష్ణ స్పష్టం చేశారు. బాల్య వివాహ ముక్తి భారత్‌లో భాగంగా స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేసుకోవాలన్నారు. బాల్య వివాహం చేస్తే రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా ఉంటాయని తెలిపారు. తల్లిదండ్రులు, పురోహితులు, వివాహం జరిపే హాల్ నిర్వాహకులపై కూడా శిక్షలు పడతాయని చెప్పారు. ఆచారాలు, సంప్రదాయాలు, చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల చిన్న వయసులోనే వివాహాలు జరుగుతుండడం చూస్తున్నామని తెలిపారు. ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఇంచార్జి మణి కందన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి ప్రమాద ఘంటికలు

ప్రజాశక్తి- లీగల్ : గత 12 ఏళ్లుగా రాజ్యాంగానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని, దీన్ని కాపాడవలసిన బాధ్యత న్యాయవాదులపైనే ఉందని ప్రొఫెసర్ కంచ ఐలయ్య పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ విశాఖపట్నం కమిటీ ఆధ్వర్యాన శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని ఎన్‌డిఎ 2024 ఎన్నికల్లో 400 సీట్లు సంపాదించి ఉంటే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేసి ఉండేదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం కారణంగా దేశంలోని అన్ని వర్గాలు ప్రజలు తమ హక్కులు వినియోగించుకొని అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా నడవాలి తప్ప మతాలకనుగుణంగా ఉండకూడదని పేర్కొన్నారు. ఇంగ్లీషులో రాజ్యాంగాన్ని చదివి అర్థం చేసుకున్న నాడే సరైన అవగాహన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఎల్ఎ రాష్ట్ర అధ్యక్షులు శాంతకుమార్, వ్యవస్థాపకులు చింతలపూడి శ్రీకాంత్, పాకా సత్యనారాయణ, వసంత్ కుమార్, ఎం.రవికుమార్, బలగా సత్యారావు, వేణుగోపాల్, వసంత్ కుమారి, ఎస్.సత్యారావు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి : గంటా

లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషిచేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గంటా కుమారుడు రవి తేజ గౌరవాధ్యక్షులుగా, సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ముఖ్య సలహాదారుగా ఏర్పాటుచేసిన ఇండోర్ స్టేడియం అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యక్షులు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన లోగోను ఎంవిపి.కాలనీలో ఉన్న నివాసంలో ఎమ్మెల్యే గంటా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. సింథటిక్ కోర్టు ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి తేజతో పాటు జివిఎంసి స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, ఆర్.చిరంజీవి, అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ, కోశాధికారి వర్మ, సభ్యులు కాళ్ల సన్నీ, ఎం.సూర్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ప్రగ్యాన్ సాంకేతిక ఉత్సవం

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పాలిటెక్నికల్ కాలేజీ ఆధ్వర్యంలో ప్రగ్యాన్ 2కె25 స్టేట్ లెవెల్ సాంకేతిక ఉత్సవాన్ని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెక్నికల్ విద్య వల్ల ప్రస్తుత సమాజంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సాంకేతిక సదస్సు ద్వారా విద్యార్తుల్లో దాగి ఉన్న నైపుణ్యం, సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. ఇన్నోవేటివ్ ఆలోచనలతో నూతన ప్రయోగాలు చేయాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు తరగతి గదిలో చెప్పే పాఠాలతో పాటు ప్రయోగాల పరిజ్ఞానం కూడా కీలకం అని వివరించారు. భీమిలి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.మురళీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల ఆలోచనలు భిన్నంగా ఉండాలని, ప్రతి సబ్జెక్టు పైనా పట్టు సాధించాలని చెప్పారు. దివిస్ జనరల్ మేనేజర్ ఎమ్ఎన్.రావు మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఫార్మసీ రంగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ముత్తంశెట్టి శ్రీనివాసరావు బహుమతులు, ప్రశంసా పత్రములను అందించారు. ఈ సాంకేతిక ఉత్సవంలో ఏర్పాటుచేసిన ఆటోమేషన్, ఫాల్కన్ ఎక్స్టెండ్ ప్రైవేట్ జెట్, ఫైర్ ఫైటింగ్ రోబోట్, పిక్ అండ్ ప్లేస్ రోబో, ఫుట్ స్టెప్ పవర్ జనరేషన్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వివిధ పాఠశాల నుండి సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ప్రగ్యాన్ సాంకేతిక ఉత్సవంలో ముత్తంశెట్టి తదితరులు

ఆసుపత్రి అభివృద్ధికి పలు తీర్మానాలు

కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫణి కుమార్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ పలు తీర్మానాలు చేసి ఆమోదించింది. అభివృద్ధి కమిటీ కన్వీనర్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఫణికుమార్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో కమిటీ సమావేశం నిర్వహించారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగాల్లో అదనంగా మరుగుదొడ్ల నిర్మాణం, జనరేటర్‌కు పైకప్పు ఏర్పాటు, ఇప్పుడున్న ఐసిటిసి, టిబి విభాగాలు ఉన్న పాత నాలుగు గదులకు మరమ్మతులు చేయాలని, పలు చోట్ల విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టాలని, ఔషధాలను నిల్వ ఉంచే గదిలో ఎయిర్ కండిషన్ ఏర్పాటు చేయాలని పలు తీర్మానాలు చేసి కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ కెవి.నరసింహారావు, సభ్యులు ఎస్.జోగారావు, గొలగాని వెంకటరావు, ఎర్నింటి వరలక్ష్మి పాల్గొన్నారు

ముగిసిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ

ప్రజాశక్తి -తగరపువలస : ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిసాయి. శనివారం విద్యార్థులకు ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ జయప్రద హాజరై మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా పిల్లలు లబ్ధి పొందుతున్నారని, ఈ సేవలు ఇలాగే కొనసాగించాలని కోరారు. చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ మాట్లాడుతూ, ఐదు నెలలుగా ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు నిరంతరాయంగా నిర్వహించారని తెలిపారు. చిట్టివలస ఉన్నత పాఠశాల (బాలికలు) ప్రధానోపాధ్యాయులు టి.శివజ్యోతి మాట్లాడుతూ ఈ సంఘం చేస్తున్న సేవలు గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విఎస్.కృష్ణ, కాలేజ్ సూపరింటెండెంట్ జివి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, వైవి.రమణ, జగన్, దుష్యంత్, రామలక్ష్మి, సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ మోహన, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకుమార్, జి.చిన్నారావు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ కో-ఆర్డినేటర్ రవ్వ భరత్‌చంద్ర పాల్గొని విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ప్రజాశక్తి- యంత్రాంగం

సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ ఉద్యోగులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సంస్థ సిఎమ్‌డి పృధ్వీతేజ్ ఇమ్మడి కోరారు. సంస్థ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎమ్‌డి మాట్లాడుతూ, రక్తదానం యొక్క ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించి, ఇలాంటి సేవా కార్యక్రమాల్లో అందరూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమాజ సేవలో భాగస్వాములుగా ఉండటం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. అనంతరం సిఎమ్‌డి పృధ్వీతేజ్ ఇమ్మడి స్వయంగా రక్తదానం చేసి, కార్పొరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా రక్తదానంలో పాల్గొనేలా స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్స్, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ టి.వనజ, ఆపరేషన్స్ డైరెక్టర్ టివి.సూర్యప్రకాష్, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.హరిబాబు, సిజిఎంలు వి.విజయలలిత, బి.అశోక్ కుమార్, డి.సుమన్ కల్యాణి పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

గాజువాక : అన్నిటికంటే రక్తదానం చాలా గొప్పదని చైతన్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.చంద్రమహాలక్ష్మి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా గాజువాక హైస్కూల్లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తదానం చేయడం వల్ల రోగికి అత్యవసర సమయంలో ఎంతో సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సంతోష్, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో దొంగలపై అప్రమత్తం

ప్రజాశక్తి-సీతమ్మధార : దొంగతనాలపై సీతమ్మధార రైతు బజార్‌లో రైతులకు, వినియోగదారులకు క్రైం ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జేబు దొంగలు ఉంటారు జాగ్రత్తగా ఉండాలని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్లు, మనీ పర్సులు ఎప్పటికప్పుడు చూసుకోవాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే రైతు బజార్ ఆఫీస్ వద్ద ఫిర్యాదు చేయాలని చెప్పారు. జేబు దొంగలు ఉంటారు జాగ్రత్త అనే వాల్ పోస్టర్లను రైతు బజార్ గేటు, గోడలపై అతికించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఇఒ కృష్ణమూర్తి, సహాయకులు సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ కేన్సర్ ఆసుపత్రికి విరాళం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నంలోని లయన్స్ కేన్సర్ జనరల్ హాస్పిటల్ అభివృద్ధికి కీర్తిశేషులు కొసరాజు వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు కొసరాజు స్వతంత్రకుమార్ రూ.1.50 లక్షల విరాళాన్ని హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమా మహేశ్వరరావుకు అందించారు. కొసరాజు స్వతంత్ర కుమార్ సేవాతత్పరతను హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావు కొనియాడారు.

విరాళం అందిస్తున్న కుమార్

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

పెందుర్తి : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 96వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో వైసిపి నాయకుడు శరగడం చిన్నఅప్పలనాయుడు ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మీసాల శ్రీదేవి, కేబుల్ రాజు పాల్గొన్నారు

ఆనందపురం : ఆనందపురం గ్రామంలో సర్పంచ్ చందక లక్ష్మి ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చందక సూరిబాబు, షిణగం చిన్న రామారావు, చందక అప్పలస్వామి, వైస్ సర్పంచ్ బంటుపల్లి రమణమ్మ, చందక అప్పలనాయుడు, ధనియాల శ్రీను, రౌతు ఆదిబాబు, కోరాడ శీను పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు కమిటీ ఆధ్వర్యాన ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు పక్కన వైసిపి నాయకులు ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆర్.ప్రభాకర్‌నాయుడు, అల్లిపిల్లి నరసింగరావు, మైలపల్లి షణ్ముఖరావు, జి.మధునాయుడు, ఎల్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పిఆర్, హెచ్ఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రయివేటు హాస్పిటళ్ల యాజమాన్యాలు హెచ్‌పిఆర్, హెచ్ఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని డిఎంహెచ్ఒ పి.జగదీశ్వరరావు తెలిపారు.

ఎఐతో భవిష్యత్తు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా భవిష్యత్తు నడుస్తుందని, అందుకు అవసరమైన నైపుణ్యాలను పొందాలని పాత్రా ఇండియా బిపిఒ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మి ముక్కువిల్లి సూచించారు. పౌర గ్రంథాలయంలో మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ 26వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. మిలీనియం ఆప్టిట్యూడ్ కోడింగ్ టెస్ట్-2025 విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా లక్ష్మి ముక్కువల్లి హాజరై మాట్లాడుతూ, ట్రెండింగ్ టెక్నాలజీలను క్రమశిక్షణతో నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు దక్కించుకోవచ్చని చెప్పారు. ఎంఎసిడి వంటి పరీక్షలు విద్యార్థుల్లో పోటీ భావనను పెంచుతాయని కూడా అభిప్రాయపడ్డారు. సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ మాట్లాడుతూ, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన శిక్షణతో పాటు ప్లేస్‌మెంట్ సహాయంపై మిలీనియం దృష్టి పెట్టిందని వివరించారు. సిఆర్‌టి ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, 2023లో మిలీనియం ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను రూ.50 లక్షల ప్రతిభా వేతనంతో ప్రారంభించామని, ఇందులో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్, వెర్బల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, కంప్యూటర్ ఫండమెంటల్స్ వంటి ఇంటర్వ్యూలో కీలకమైన నైపుణ్యాలను పరీక్షించుకోడానికి విద్యార్థులకు అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం మిలీనియం ఆప్టిట్యూడ్, కోడింగ్ టెస్ట్‌ను 30 కళాశాలల్లో నిర్వహించామని, 5,500 మంది విద్యార్థులు పాల్గొనగా, 1,000 మంది ర్యాంకర్లుగా ఎంపికయ్యారని తెలిపారు. ఎస్ఆర్ఎం కాలేజీకి చెందిన మరిసెట్టి డింపుల్ మొదటి ర్యాంక్ సాధించి రూ.50 వేలు నగదు బహుమతి గెలుచుకున్నారని ప్రకటించారు. 2వ ర్యాంక్ వెమనమంద శ్రీసాయి ప్రణవ్‌వర్మ (ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్), 3వ ర్యాంక్‌ను బెజవాడ నూక శ్రీనివాసరావు (ఆస్‌కాలేజ్ ఆఫ్ టెక్, మేనేజ్‌మెంట్), 4వ ర్యాంక్ షేక్ కరీముల్లా (ఎంవిఆర్ డిగ్రీ కాలేజ్), 5వ ర్యాంక్‌ను చింతల గణేష్ (సెంచూరియన్ యూనివర్సిటీ) పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెహరా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ సిఎస్ఇ విభాగాధిపతి నారాయణరావు చౌక్కాపు, ఎంవిఆర్ డిగ్రీ కాలేజ్ ఫ్యాకల్టీ బి.రత్నకుమార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫిజిక్స్ హెచ్‌ఒడి డాక్టర్ పిఎల్.శరణ్య పాల్గొన్నారు. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.

మిలీనియం సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ వార్షికోత్సవంలో అతిథులు

కాలుష్య నివారణకు మొక్కలు అవసరం

ప్రజాశక్తి -గాజువాక : కాలుష్య నివారణకు మొక్కలు అవసరం అని భాస్కర్ విద్యానికేతన్ పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు తెలిపారు. జివిఎంసి 70వ వార్డు పరిధి భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం మొక్కల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవాళికి, సమస్త ప్రాణులకు మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రకృతి సమతుల్యతలో మొక్కల పాత్ర ప్రధానమైనన్నారు. ఆక్సిజన్‌కు మొక్కలే ఆధారమని వివరించారు. వృక్షాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రకృతినందలి సమస్త ప్రాణులకు అవసరమైన ఆహార పదార్థాలు, ఔషధాలు మొక్కల నుండే లభిస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతంలో మొక్కలు నాటడానికి, పెంచడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఈ సందర్భంగా 5, 6 తరగతుల విద్యార్థులు తులసి, వేప, ఉసిరి, మునగ, కొబ్బరి, దానిమ్మ, అరటి, మామిడి, జామ తదితర మొక్కలతో పాఠశాలకు హాజరై వాటి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పద్మ, అన్నపూర్ణ, జానకి, సునీత పాల్గొన్నారు.

మొక్కలతో విద్యార్థులు

పురస్కారాన్ని అందుకుంటున్న వరహాలబాబు

హోంగార్డుకు పురస్కారం

ప్రజాశక్తి - నాతవరం : నాతవరం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హోం గార్డ్ ఎ.వరహాలబాబు ఉత్తమ ప్రతిభ చూపినందుకు పురస్కారాన్ని అందుకున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా హోంగార్డ్స్ రైసింగ్ డే సందర్భంగా అనకాపల్లిలో సేవా పురస్కారం అందుకున్నారు.

'శంభాల' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి- వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో శుక్రవారం 'శంభాల' చిత్ర బృందం సందడి చేసింది. డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా చిత్ర యూనిట్ కళాశాలను సందర్శించింది. క్యాంపస్‌కు విచ్చేసిన టాలీవుడ్ హీరో ఆది సాయికుమార్, హీరోయిన్ అర్చనా అయ్యర్, చిత్రంలోని ఇతర ప్రధాన తారాగణం స్వాసిక విజయ్, మధునందన్, రవి వర్మ, మీసాల లక్ష్మణ్‌కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో వారు కాసేపు ముచ్చటించారు. సినిమా కథాంశం, షూటింగ్ అనుభవాలు, తమ పాత్రల తీరుతెన్నులను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు హీరో ఆది, ఇతర నటీనటులు ఉత్సాహంగా సమాధానా లిచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, పి.ప్రసాద్, హెచ్ఆర్ కె.భార్గవ్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామిని శనివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు మంత్రికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. హోం మంత్రి ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేశారు. అనంతరం బేడా మండపం ప్రదక్షిణ చేశారు. తర్వాత స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఇఒ ఎన్.సుజాత హోం మంత్రిని శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి పటం, జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి దంపతులు దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు.

సింహగిరిపై వైభవంగా నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ గోవిందరాజస్వామి ఉత్సవమూర్తిని, ఉభయ దేవేరులైన శ్రీదేవి, భూదేవితో సహా అలంకరించిన కల్యాణ మండపంలో అధిష్టింపజేశారు. పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శుభారంభం పలికారు. స్వామివారికి, అమ్మవార్లకు కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. మాంగళ్య ధారణను కమనీయంగా నిర్వహించారు.

ప్రజా దర్బార్‌కు వినతులు

ప్రజాశక్తి-పెందుర్తి: సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజవర్గంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుంచి 110 అర్జీలు వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లు మరమ్మతులు, డ్రైనేజీలు, ఇళ్ల స్థలాలు, రెవెన్యూ సంబంధిత సమస్యలు, కొత్త పెన్షన్లు మంజూరు, గృహ నిర్మాణానికి విద్యుత్తు సమస్యలు తదితరాలపై అర్జీలు అధికంగా వచ్చినట్లు చెప్పారు. ఈ అర్జీలను పిజిఆర్ఎస్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు వివరించారు. అర్జీలపై సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని వారు ఈ నెల 14వ తేదీ లోపు సమీప సచివాలయాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి4 నియోజవర్గం నోడల్ అధికారి పావని, పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ అయితే సింహాచలం, నాయకులు కొరుపోలు రామానాయుడు, వేగి దివాకర్, పిల్ల జగన్మోహన్ పాత్రుడు, బయలపూడి హరగోపాల్, మడక బంగార్రాజు, రాపర్తి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లకు వినతి అందిస్తున్న ముస్లిం సోదరులు

గొల్లగుంట ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ పూర్తిచేయాలి

పరవాడ మండలం, రావాడ పంచాయతీ గొల్లగుంటలోని ముస్లిం శ్మశానవాటికలో నిలిచిపోయిన ప్రహరీ నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేయించాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, తమ గ్రామానికి సంబంధించిన శ్మశానవాటిక అచ్యుతాపురం మండలం, నడింపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 2లో సర్వీస్ ఇనాం భూమిలో 0.67 సెంట్లు స్థలంలో ఉందని తెలిపారు. 400 ఏళ్ల నుంచి ముస్లిం సమాధులున్నాయని తెలిపారు. ఇంతటి ప్రాచీనమైన శ్మశానవాటికను కొంత మంది భూ రికార్డుల్లో నమోదు చేసుకొని కబ్జాకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. గత నెలలో శ్మశానవాటికలో పనులు ప్రారంభించారని, కోలమ్స్ కాంక్రీట్ ఫుటింగ్ పనులు చేశాక నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రహరీ నిర్మాణం కోసం రూ.18లక్షలు అంచనా వ్యయం వేశారని, అందులో పంచాయతీ నిధులు రూ.5లక్షలు మంజూరై ప్రహరీ పనులు చేపట్టినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారని వివరించారు. అధికారులపై వచ్చిన ఒత్తిడి కారణంగా పనులు నిలిపివేసినట్లు తమకు అనుమానం కలుగుతుందని, తక్షణమే పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్అలీ, మౌలాలి, మదీనా, అజారుద్దీన్, అన్సార్, మహమ్మద్ రఫీ, అన్వార్, షేక్ తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోమ్ గార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : హోం గార్డ్స్ 63వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అనకాపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో వేడుకలను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి హెూం గార్డ్స్ గౌరవ వందనం స్వీకరించి, పరేడ్‌ను పరిశీలించారు. హెూం గార్డ్స్, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవాస్ఫూర్తితో ప్రారంభమైన ఈ సంస్థ, నేటికీ ప్రజా భద్రతలో కీలక భూమిక పోషిస్తోందన్నారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, నేరాల నివారణ, రెగ్యులర్ పోలీస్ విధులలో హెూం గార్డ్స్ పోలీసులకు వెన్నెముకలాగా నిలుస్తున్నారని కొనియాడారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల హెూం గార్డ్స్ జిల్లాలలో మొత్తం 667 మంది హెూం గార్డ్స్, అందులో 93 మంది మహిళా హెూం గార్డ్స్ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. హెూం గార్డ్స్ పోలీసులు మాత్రమే కాదు, అనేక శాఖల్లో కూడా విశేష సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, సబ్ డివిజన్ డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, కృష్ణ చైతన్య(ట్రైనీ), ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, ప్రేమ్ కుమార్, స్వామి నాయుడు, అశోక్ కుమార్, ఏఆర్ ఆర్ఐలు రమణమూర్తి, రామకృష్ణారావు, మన్మధ రావు, సంజీవరావు, జిల్లా హెూం గార్డ్స్ ఇన్చార్జులు నర్సింగరావు, చిన్నారావు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పి తుహిన్ సిన్హా

మెటీరియల్ చూపుతున్న ట్రస్టు సభ్యులు, ఎంపిటిసి, టీచర్లు, విద్యార్థులు

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఏ.కోడూరు, కొరువాడ జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో 10వ తరగతి విద్యార్థులకు డిసిఇబి స్టడీ మెటీరియల్‌ను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. ఏ.కోడూరు హైస్కూల్‌లో 103 మందికి, కొరువాడ హైస్కూల్‌లో 33 మందికి పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు శేఖర్, స్వప్నప్రియ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో అమ్మ ఛారిటబుల్ ట్రస్టు సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో కోడూరులో సర్పంచ్ అక్కునాయుడు, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు లెక్కల కోటేశ్వరరావు, లెక్కల సత్యనారాయణ, కొరువాడలో ఎంపిటిసి చీపురపల్లి అచ్చిబాబు, ట్రస్టు సభ్యులు ఆర్‌కె.నాయుడు, కిల్లి నూకరాజు, స్కూల్ కమిటీ ఛైర్మన్ సిహెచ్.అప్పారావు, లెక్కల అచ్చిబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సిఐ చంద్రశేఖర్‌రావు

ఫిట్ ఇండియా ఆటల పోటీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మేరా యవ భారత్ కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం ఫిట్ ఇండియా ఆటల పోటీలు నిర్వహించారు. దీనికి విచ్చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర రావు మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. నేటి యువత ఆటలపై మొగ్గు చూపించడం తగ్గిందని చెప్పారు. దురలవాట్లకు స్వస్తి పలికి క్రీడల పట్ల శ్రద్ధ చూపించాలన్నారు. ఈ ఆటల పోటీల్లో వాలీబాల్, కోకో రన్నింగ్, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించగా, సుమారు 150 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల అధినేత డి.ప్రసాద రావు, ఎన్ఎస్ఎస్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆర్. లీలా ప్రసాద్, మీరా యువ భారత్ వాలంటీర్ వీసం రమ్య తదితరులు పాల్గొన్నారు.

భూములకు, మాకు రక్షణ కల్పించాలి

తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కెఎం.పాలెం గ్రామానికి చెందిన కణితి అర్జునరావు నుంచి తమకు, తమ భూములకు రక్షణ కల్పించాలని ముసిడిపల్లి గ్రామానికి చెందిన బడుగు, బలహీన వర్గాలకు (యాత సామాజిక తరగతి) చెందిన వారు శనివారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి, ఎస్ఐకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ముసిడిపల్లి గ్రామ రెవిన్యూలో 40 ఏళ్ల కిందట ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం గ్రామంలోని బలహీన వర్గాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు సర్వేనెంబర్లు 575/4, 578/3, 583/4, 583 /3.4లో మెట్టు, పల్లం భూములు కేటాయించినట్లు చెప్పారు. అప్పటి నుంచి నేటికీ ఆ భూములు తామే సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎస్సీ సామాజిక తరగతికి చెందిన కణితి దండేష్ తమ వాటా భూమి సర్వే నెంబరు 578/3లో 63 సెంట్లును 2004 ఆగస్టు 18న అదే సామాజిక తరగతికి చెందిన రాయి బుచ్చమ్మ విక్రయించినట్లు చెప్పారు. కాగా ఇప్పుడు కణితి దండేష్ వారసుడు కణితి అర్జునరావు, యాత సామాజిక తరగతికి చెందిన వారి సాగులో ఉన్న సర్వే నెంబరు 578/4లోని భూమిని ఆక్రమణకు ప్రయత్నిస్తుండగా, దాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. దీంతో తమపై అర్జునరావు పోలీస్ స్టేషన్లో ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కింద తప్పుడు కేసులు పెట్టి మానసికంగా హింసించడమే కాకుండా పలు విధాలుగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దీనిపై మండల అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ముసిడిపల్లి గ్రామానికి చెందిన యాత సామాజిక తరగతి వారు విజ్ఞప్తి చేశారు.

ప్రీ ఆర్‌డిసి క్యాంపునకు సెయింట్ జాన్స్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కశింకోట : హైదరాబాదులో మెహేదిపట్నం గారిసన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 7 నుండి 16 వరకు నేషనల్ క్యాడేట్ కార్ప్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మక శిక్షణ శిబిరం ప్రీ ఆర్డిసి క్యాంపు-2కు కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న కొత్తపల్లి ఆశిష్ 13 (ఏ) బెటాలియన్ నుండి జెడి క్యాడేట్‌గా ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలియజేసింది. ఈపిఆర్ఇ - డిఆర్‌సి శిబిర సమయంలో క్యాడేట్ ఆశిష్‌కు డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వపు నైపుణ్యం, జాతీయ ఏకీకరణ వంటి విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో దేశవ్యాప్తంగా ఎంపిక అయ్యే ఉత్తమ క్యాడెట్లను ఢిల్లీలో జరుగునున్న 2026 గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఆశిష్ ఎంపిక కావడం పట్ల స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపల్ రూపానంది అభినందనలు తెలిపారు.

రామాలయానికి విరాళం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక సంతబయలులో గల రామాలయ ద్వార బంధాలకు ఇత్తడి తొడుగు నిమిత్తం శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన సెరగడం గోవిందు, ఉదయ్ దంపతులు వారి తనయులతో కలిసి రూ. 40 వేలు, తంపర మూల సంఘం అధ్యక్షులు సరగడం జగన్, పెంటకోట అజయ్‌లు చెరొక రూ.10 వేల చొప్పున కమిటీ వారికి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయి కృష్ణ, సరగడం జగన్, టెక్కలి రమణబాబు, పోలిమేర కృష్ణ, దొడ్డి గణేష్, విల్లూరి నాయుడు, పోలమరశెట్టి రామరాజు, లీల, క్రాంతి, కాండ్రేగుల భాగ్యరాజ్, దొడ్డి రమణబాబు, శిల్పి అలమండ శ్రీనుబాబు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : అనకాపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల్లో ట్రాఫిక్ భద్రతపై అవగాహన పెంచడం లక్ష్యంగా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు శనివారం అనకాపల్లిలో భారీ స్థాయిలో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం.వెంకట నారాయణ నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీ స్థానిక ఆదిత్య డిగ్రీ కాలేజ్, హిమశేఖర్ డిగ్రీ కాలేజ్, శ్రీకన్య డిగ్రీ, స్ఫూర్తి డిగ్రీ కాలేజ్ విద్యార్థులతో కలిసి పెరుగు బజార్, చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని ప్రజలకు సందేశం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించే విధంగా ప్రతిజ్ఞ చేశారు. యువత, విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తే అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శేషగిరిరావు, ట్రాఫిక్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎస్‌పి శ్రావణి

చౌడువాడ పంచాయతీ కార్యదర్శి బదిలీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ మేయర్ పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న పాలూరి సురేష్ బాబు ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. ఇక్కడ పంచాయతీ గుమస్తా డి.అప్పారావు ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

యాదవ సంఘం అధ్యక్షునిగా అప్పలరాజు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : యాదవ సంక్షేమ సంఘం పాయకరావుపేట నియోజకవర్గం అధ్యక్షులుగా కోన అప్పలరాజు, గౌరవ అధ్యక్షులుగా గొర్ల బాబురావును నియమించినట్లు ఆ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు భరణికాన బాబురావు తెలిపారు. శనివారం ఉదయం అడ్డరోడ్డులో కోన అప్పలరాజు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యాదవుల సంక్షేమానికి సమస్యల పరిష్కారానికి సంఘం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భరణికాన నరసింహమూర్తి, సబ్బి శ్రీను, దూళి శ్రీను, మామిడి నాగరాజు, పాము సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం, కశింకోట, తేగాడ, బయ్యావరం, కొత్తపల్లి, బుచ్చయ్య పేట, కన్నూరు పాలెం, అచ్చెర్ల, తీడ గ్రామాలలోని 22 మందికి సీఎం సహాయనిధి నుండి మంజూరైన 13లక్షా 56వేల రూపాయిల చెక్కులను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ శనివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపికృష్ణ, షేక్ బాబార్, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, కాండ్రేగుల సతీష్, బుదిరెడ్డి గంగయ్య, ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణరావు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

నేడు రాష్ట్రస్థాయి ఘంటసాల పాటల పోటీలు

ప్రజాశక్తి - యలమంచిలి : పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు 103 జయంతి సందర్భంగా 'రాష్ట్రస్థాయి ఘంటసాల పాటల పోటీలు' ఆదివారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పూరిజగన్నాథం, సిహెచ్. శంకర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఉదయం 9 గంటలకు ఎం.ఆర్.ఒ. ఆఫీసు దగ్గర గల ఘంటసాల కళామందిర్‌లో జరుగుతాయన్నారు. ఈ పోటీలు 15 ఏళ్లు లోపు వారికి 16 ఏళ్లు పైపడిన వారికి వేరు వేరుగా జరుగుతాయని చెప్పారు. పోటీలో పాల్గొనే కళాకారులు ప్రవేశ రుసుం రూ.100 చెల్లించి మగవారైతే ఘంటసాల పాడిన పాటనే పాడాలని, స్త్రీలైతే ఘంటసాల సంగీత దర్శకత్వం వహించిన పాటలనే పాడాలని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. వివరాలకు ఇవటూరి సాంబశివరావు, రామకృష్ణలను 9868403081, 9704896996 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అభివాదం చేస్తున్న నూతన కార్యవర్గం

రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం

మండల సమావేశంలో ధ్వజమెత్తిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కోన సంధ్య అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ రహదారి నిర్మాణ పనులలో ఇటుకల పొడి వేసి రోలింగ్ చేస్తున్నారని చెప్పారు. నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలపై అవసరమైతే ఆందోళన చేస్తామని తెలిపారు. గ్రామాల్లో సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవటం లేదన్నారు. సమావేశంలో జెడ్పి కోఆప్షన్ సభ్యులు నార్మల్ కుమార్, సభ్యులు దేశ శెట్టి శంకర్రావు, శనివాడ జువాల నాయుడు, ఎంపీడీవో బి చిన్నారావు, డిప్యూటీ తహశీల్దారు శ్యామ్, తిమ్మరాజుపేట కొండకర్ల దుప్పుతురు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు ఎస్ జగ్గప్పారావు, గొంతిన భక్త సాయిరాం, దేశంశెట్టి వెంకటరమణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీస్తున్న దుప్పుతూరు సర్పంచ్ శంకరరావు

ఆర్మీకి ఎంపికైన లక్ష్మణరావును సత్కరిస్తున్న దృశ్యం

దేశ రక్షణకు యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి-సబ్బవరం : దేశ రక్షణకు యువత ముందుకు రావాలని స్థానిక తహశీల్దారు బి.చిన్నికృష్ణ అన్నారు. స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కాలేజీలో ఇటీవల ఆర్మీకి ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ పోతల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో కష్టపడి తమ లక్ష్యాలను నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. ఆర్మీకి ఎంపికైన లక్ష్మణరావును ఆయన అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం టిడిపి అధ్యక్షులు పోతల కనకరాజు, రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని భీమవరం, గోకులపాడు, ధర్మవరం గ్రామాలలో పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ పరిశీలన చేశారు. శనివారం ఆయా గ్రామాలలో డోర్ టు డోర్ శానిటేషన్ కార్యక్రమాలు పరిశీలన చేసి స్థానిక ప్రజలకు తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్తను సంపద తయారీ కేంద్రం వద్దకు తరలించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తకు భరత్ పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : కశింకోట మండలం ఎఎస్.పేట గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త వైద్యిరి కౌశిక్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నేపథ్యంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ శనివారం అనకాపల్లి ఉషాప్రైమ్ హాస్పటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి మలసాల కుమార్ రాజా, కశింకోట మండల పార్టీ ప్రెసిడెంట్ మలసాల కిషోర్, కిట్టు, డెనీ, గణేష్, వంశీ ఉన్నారు.

సబ్సిడీపై వేరుశనగ, మినుము, పెసర విత్తనాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : రబీలో రైతులు మెట్ట ప్రాంతంలో సాగు చేయుటకు వేరుశనగ, మినుములు పెసలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 30 కేజీల వేరుశనగ విత్తనాలు రూ.2,760 కాగా రూ.1656 ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. మినుములు 4 కేజీలు ధర రూ.552 కాగా రూ.386కు, పెసలు నాలుగు కేజీల బ్యాగు ధర రూ.540 కాగా రూ.378 రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. కావలసిన వారు తమ ఆధార్, వన్ బి జెరాక్స్‌లో డబ్బు చెల్లించి ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద తీసుకోవాలని కోరారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న సాయికృష్ణ

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని చూచుకొండ గ్రామంలో శనివారం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, కాండ్రేగుల శంకర్, పెంటకోట శ్రీరామమూర్తి, గణేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న టిడిపి నేత సాయికృష్ణ

ద్వారకానగర్ సమస్యలు పరిష్కరిస్తా

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-చోడవరం : పట్టణంలోని ద్వారకా నగర్ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. శనివారం చోడవరం పట్టణంలో ద్వారక నగర్ బాలాజీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వారకా నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్తు వంటివి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడానికి అధికారులు నివేదికలు తయారు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. కోణం గెస్ట్ హౌస్ వద్ద మురుగునీటి కాలువకు శాశ్వత పరిష్కారంగా డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ జి వెంకట సత్యనారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, పంచాయతీరాజ్ ఇంజనీర్ శాంతారామ్, దేవరపల్లి వెంకట అప్పారావు, వార్డు సభ్యులు టి శ్రీనివాస్, పంచాయతీ ఈవో కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏపి ఎన్‌జిఒ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం : ఏపీ ఎన్జీవోస్ యూనియన్ చోడవరం శాఖ ఎన్నికలు శనివారం యూనియన్ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కే సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్వీ రమణ, ఉపాధ్యక్షులుగా కే రమణమ్మ, బి గోవిందరావు, కే శివ గణేష్, సహాయ కార్యదర్శులుగా ఎస్ సింహాచలం, పి రాజేశ్వరరావు, బి ఈశ్వరరావు, ఎస్ అమ్మాజీ, కోశాధికారిగా కే సింహాచలం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జివి రమణబాబు, పర్యవేక్షకులుగా కే శ్రీనివాసరావు, పి త్రినాథ వ్యవహరించారు.

హోటల్ యజమానులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-పరవాడ : హోటల్ యజమానులు నిబంధనలు పాటించాలని సిఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం రాత్రి పరవాడ సిఐ అధ్యక్షతన జరిగిన హోటల్ నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరాల నిరోధం కోసం హోటళ్ల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. హోటళ్లలో అక్రమ కార్యకలాపాలు కొనసాగితే సంబంధిత యాజమాన్యంపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. హోటల్‌కు వచ్చే ప్రతి అతిథి పూర్తి వివరాలు, ఫోటోలు నమోదు తప్పనిసరి, గుర్తింపు పత్రాలు చెక్ చేసి రికార్డు చేయాలని కోరారు. ప్రాంగణంలోని అన్ని సీసీ కెమెరాలు 24 గంటలు పని చేస్తుండాలన్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది, హోటల్ యాజమాన్యం పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ సాధనకు రోడ్ మ్యాప్

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని గుర్రప్ప సొట్రేట్లో యలమంచిలి రెవిన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కలిసి వచ్చే అన్ని పార్టీలను, అన్ని వర్గాలను కలుపుకొని వెళ్ళాలని నిర్ణయం చేశారు. రెవిన్యూ డివిజన్ కోసం ఎలా ముందుకు వెళ్ళాలి, ఏమి చెయ్యాలి అనేది దానిపై రోడ్ మ్యాప్ తయారు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, రెవిన్యూ డివిజన్ జీవోపై అభ్యంతరాలు తెలియజేస్తూ, తహసీల్దార్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పిల్లా రామకుమారి, వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, కొట్టారు సాంబ, బొద్దపు ఎర్రయ్య దొర, నక్క శివ శంకర్, దాసరి కుమార్, కొండబాబు, కరణం శ్రీహరి, ఎల్లపు రాజు, అడపా శేషగిరిరావు, రావి రామసత్యం, గనిశెట్టి ఏసుదాసు, ఆకుల వెంకటేష్, కరణం ప్రసాద్, దొడ్డి రవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల (ఎంహెచ్ స్కూల్) 1975 పదో తరగతి విద్యార్థులు 50 వసంతాల స్వర్ణోత్సవ జీవిత సాఫల్య గోల్డెన్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఇందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో 1975 పూర్వ విద్యార్థులు నిర్మించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక బ్యాచ్ స్వర్ణోత్సవాలు చేసుకోవడం అంటే బంగారు అక్షరాలతో లిఖించదగిన అని పేర్కొన్నారు. అనంతరం హైస్కూల్‌లో ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి లర్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మద్దిలి వినోద్ బాబు, స్వర్ణోత్సవ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, గౌరవ అధ్యక్షులు పిల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మళ్ల లోకేశ్వరరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు, అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్.రావ్ షాపింగ్ మాల్ 26వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో 26 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతున్న ఎంఎస్ రావ్ షాపింగ్ మాల్ 26వ సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు దంపతులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 26 సంవత్సరాలు విజయవంతంగా షాపింగ్ మాల్‌ను నిర్వహిస్తున్న మాల్ అధినేత చిన్నికి అభినందనలు తెలిపారు. ఎంవిఆర్ సోదరుడు ఎం.ఎస్.రావ్ అధినేత మాట్లాడుతూ గత 26 సంవత్సరాల నుంచి చిన్న స్థాయి నుంచి నేడు ఇంతటి స్థాయికి ఎదగడానికి కారణమైన కస్టమర్లకు శ్రేయోభిలాషులకు మిత్రులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకమైన ఆఫర్లు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ముత్యాల వెంకటేశ్వరరావు తనయులు రాజేష్, సంజయ్ బాబు, ఎం.వి.ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ

పాడి రైతుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-వడ్డాది : పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి చేస్తుందని డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. కోమల్లపూడిలో పాల సంఘ సభ్యులు కనిగిరి అమ్మతల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడు కుమారుడు గణేష్‌కు శనివారం విశాఖ డెయిరీ నుండి రూ.15000 ఆర్థిక సహాయం డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన పాలను సరఫరా చేసి డెయిరీ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గోకివాడ కోటేశ్వరరావు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని శనివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. గ్రామంలో ఎంతమందికి కాన్పులు జరిగాయి ఎక్కడ జరిగాయి అని అంగన్వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు బయలపూడి రాందాస్, నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, రాజాన సన్యాసినాయుడు, లాలం రాజు, రాజాన విజయ్ పాల్గొన్నారు.

హాకీ కోర్టు నిర్మాణం చేస్తాం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలిలో హాకీ కోర్టు నిర్మాణం చేస్తామని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. సుడిగాలి పర్యటనలో భాగంగా యలమంచిలి డిగ్రీ కళాశాల గ్రౌండ్‌ను శనివారం ఆయన సందర్శించారు. హాకీ ఆడుతున్న క్రీడాకారులను కలిసి వారితో కొద్దిసేపు హాకీ ఆడారు. ఆటగాళ్ళు డైట్, ఫిట్నెస్ లెవెల్స్ ఏవిధంగా ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో ఆధునిక పద్ధతులలో హాకీ టర్ఫ్ కోర్టు నిర్మాణం చేబడతానని, అంతర్జాతీయ స్థాయిలో యలమంచిలి హాకీ క్రీడాకారులను తయారు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ కె నరేష్, పూటకూటి రమేష్, కోటరు శ్రీను మాస్టర్, వరహాలు, హర్ష, లోహిత్, శ్రీరాములు పాల్గొన్నారు.

వేగంగా తారురోడ్డు నిర్మాణం

తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెద్దమదిన జంక్షన్ నుండి చింతపాక గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో ఈ రోడ్డు గుంతలుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమీప గ్రామాలకు చెందిన వారు స్థానిక శాసన సభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో రోడ్డు నిర్మాణానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. గత వారం రోజులుగా తారు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

మహనీయుడు అంబేద్కర్


వేములవలసలో నివాళులర్పిస్తున్న నేతలు

పలుచోట్ల ఘనంగా వర్ధంతి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఎంవిపి.కాలనీ : ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. వర్సిటీ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, అదనపు సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు పాల్గొన్నారు.

విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆధ్వర్యాన కాన్వెంట్ జంక్షన్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. వీపిఎ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంక్షేమ సంఘం, ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. పోర్ట్ ముఖ్య నిఘా అధికారి టి.అరుణ్ ప్రసాద్, వివిధ విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు. మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

సమాజంలో అన్ని వర్గాలకు సమానత్వం కల్పించేందుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఎంతో కృషి చేశారని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తితో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

విశాఖ కలెక్టరేట్ : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక జివిఎంసి స్కూల్లో, సిపిఐ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. జివిఎంసి 2వ వార్డు పరిధి మామిడిపాలెంలో అంబేద్కర్ విగ్రహాన్ని అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆవిష్కరించారు. ఉడికల వెంకటరమణ ఈ విగ్రహాన్ని బహూకరించారు. ఆయా కార్యక్రమాల్లో వై.స్వామి, రెడ్డిపల్లి అప్పలరాజు, దండి వెంకటేష్, కొండపు ఈశ్వరరావు, కానూరు రాంబాబు, ఉడికల నరసింగరావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 1వ వార్డు వైసిపి అధ్యక్షుడు జగ్గుపిల్ల ప్రసాద్ ఆధ్వర్యాన ఎస్సీ కాలనీ పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, అట్టలను పంపిణీచేశారు. కార్యక్రమంలో భాగం గోపాలరావు, అక్కరమాని రామునాయుడు, జీరు వెంకట రెడ్డి పాల్గొన్నారు

సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డులో అంబేద్కర్ విగ్రహానికి వద్ద డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కోఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలిరెడ్డి గోవిందరాజు, కె.చిన్న, కె.శ్రీను పాల్గొన్నారు.

ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి పూలమాల వేసి నివాళులర్పించారు. టివి.సూర్య ప్రకాష్, టి.వనజ, ఎస్.హరిబాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు పరిధి ప్రభుత్వ డైట్ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో గొలగాని నరేంద్రకుమార్, కనకల అప్పలనాయుడు, కుప్పిలి వెంకటేష్, కెఎస్ఆర్ కృష్ణారావు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి మల్లయ్యపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కుడితి రామారావు, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక వంద అడుగుల రోడ్డులోని అంబేద్కర్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ, పి.దుర్గారావు, విష్ణుమూర్తి పాల్గొన్నారు. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, వంగలపూడి అప్పలరాజు,కాశీ జాన్ రమేష్ పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పొట్నూరు, కొవ్వాడ, పెంట, అనంతవరం, పద్మనాభం జంక్షన్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకుడు ఈశ్వరరావు ఆధ్వర్యంలో పద్మనాభం, రెడ్డిపల్లి సచివాలయం వద్ద ఉన్న విగ్రహాలకు ఎంపిపి రాంబాబు పూలమాలలు వేశారు. రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రూపాకుల రవికుమార్ పద్మనాభం జంక్షన్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.నాగమణి, వెంకట్రావు, శ్రీను పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం, వేములవలస జంక్షన్ వద్ద దుమ్మెద అప్పలసూరి, వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. మజ్జి వెంకట్రావు, చెన్నా సత్యం, ఉప్పాడ సీతా రాము పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు పరిధి లక్ష్మీనగర్, బాజీ జంక్షన్, గోపాలపట్నంలో అంబేద్కర్ విగ్రహాలకు ప్రభుత్వ విప్ గణబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చీడికాడ:రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆటో స్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళి అర్పించారు. గాలి కోటేశ్వరరావు, అప్పారావుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వైసిపి గ్రామ శాఖ అధ్యక్షుడు మహేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం ప్రెసిడెంట్ పరవాడ అప్పారావు, బూడి యువసేన సభ్యులు కరగాన వెంకట శివకుమార్, కామిరెడ్డి గడ్డం నాయుడు, నూనెల పైడితల్లి, పరవాడ రామారావు, బొబ్బిలి దేముడు పాల్గొన్నారు.

నర్సీపట్నం: పట్టణంలోని అబీద్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, సిఐటియు నాయకులు దంట్ల శివ మాట్లాడుతూ, రాజ్యాంగంలో ఉన్న హక్కులను కాపాడుకోవాలన్నారు.

నక్కపల్లి:నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి విజయ, ఎంపీడీవో బి చైతన్య ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో సీతారామ రాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఎంఈఓ లు నరేష్, నాగన్నదొర, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండల విద్యా కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ సత్యనారాయణ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం దాసు, ఉపాధ్యాయులు బాలకృష్ణ, వెంకటేష్, రిసోర్స్ సెంటర్ సిబ్బంది నాయుడు, సరస్వతి, వాణి పాల్గొన్నారు.

మాడుగుల:మాడుగుల అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా ఆయన విగ్రహానికి ఏఎంసి ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ సూర్యారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మరువాడ ఈశ్వరరావు, సయ్యపురెడ్డి సత్తిబాబు, వత్తుల ప్రకాష్, ఆకుల రాము పాల్గొన్నారు.

దేవరాపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ యూత్ సంఘం, మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కాటపల్లి సృజన, పెద్దాడ వెంకటరమణ నివాళులర్పించారు.

గొలుగొండలో...

కశింకోట : కశింకోట పోలీస్ స్టేషన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎంపీడీవో సిహెచ్.చంద్రశేఖర్‌రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో శివలంక సత్యనారాయణ, ఉడిగుల నరసింగరావు, మంత్రి అప్పారావు పాల్గొన్నారు

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది అరుంధతి కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కండేల్లి వరహాలు, కొండబాబు, చిన్న, సాయి పాల్గొన్నారు.

అనకాపల్లి : జై భీమ్ సేన సేవా సంఘం రేబాక ఇంద్ర కుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్లో అంబేద్కర్ విగ్రహానికి డైట్ కాలేజ్ చైర్మన్ దాడి రత్నాకర్ నివాళులర్పించారు. 83వ వార్డు లక్ష్మీదేవి పేటలో అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో డివిఎంసి సభ్యులు రేబాక మధుబాబు శ్రద్ధాంజలి ఘటించారు. అనకాపల్లి గాంధీ నగర్ ఎస్సీ బాలుర హాస్టల్లో అబ్దుల్ కలాం సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

సీతమ్మధారలో నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్

అనకాపల్లి రూరల్ : స్థానిక భీమునిగుమ్మం వద్ద రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలారపు త్రినాద్, దాడి జగన్, యంద్ర రామకృష్ణ, లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ పిహెచ్‌సిలో అంబేద్కర్ చిత్రపటానికి వైద్యాధికారి డాక్టర్ పి.హారిక, రియా ఫౌండేషన్ ఛైర్మన్ ఎండి రాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో శివలంక నర్సింగరావు, ఈరుగుల లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మొగలిపురం ఎస్సీ కాలనీ వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐడి బాబు, దొమ్మిసి ఈశ్వరరావు, ఐ గోపి పాల్గొన్నారు. సబ్బవరం సాయినగర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొర్రా జయరాజు ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో దువ్వ దుర్గాలు, కొమ్ముకోట అప్పారావు పాల్గొన్నారు.

యస్.రాయవరం : మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ ఇందిరా కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, జెడ్‌పిటిసి కాకర దేవి, అమలకం అబద్దం పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక అంబేద్కర్ భవనం వద్ద అంబేద్కర్ విగ్రహానికి జిల్లా రిటైర్డ్ జడ్జి నడుపూరి సన్యాసిరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో కండేల వెంకటరావు, యర్రంశెట్టి వరప్రసాద్, రాజు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో...

ఐద్వా ఆధ్వర్యాన...

పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం టిడ్కో కాలనీలో అంబేద్కర్ చిత్ర పటానికి ఐద్వా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, నాయకులు మంగతాయారు, తుంపాల అన్నపూర్ణ, మన్యాల బంగారమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

కశింకోట : కసింకోటలో ఐద్వా ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి, సిపిఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడలో..

ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి: రావికమతం: రావికమతం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ తగాదాలకు సబంధించి ఎంఎల్సి కమిటీ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి సుజాత, ఎంపీడీఓ మహేష్, తహశీల్దారు అంబేద్కర్ పాల్గొన్నారు. వీరి సమక్షంలో మండలంలో పిల్లవానిపాలెం, మేడివాడ, కేబీపీ అగ్రహారం గ్రామాలకు చెందిన మూడు ఎమ్మెల్సీ కేసులపై సమగ్ర విచారణ చేపట్టారు. సంబంధిత కేసుల వివరాల పత్రాలను పరిశీలించిన అనంతరం అధికారులు తగిన సూచనలు జారీ చేయడం జరిగింది.గ్రామస్థాయి సమస్యలను న్యాయపరంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

విచారణ చేపడుతున్న అధికారులు

సబ్సిడీపై మోటార్ ఇంజిన్లు

ప్రజాశక్తి -నక్కపల్లి: స్థానిక హోం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం టిడిపి నాయకులు సబ్సిడీపై మంజూరైన మోటార్ ఇంజన్ లను మత్స్యకారులకు అందచేసారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద పాయకరావుపేట నియోజకవర్గంలోని మండలం లోశ్రీతీ రాజయ్యపేట గ్రామానికి చెందిన 10 మంది మత్స్యకారులకు 40 శాతం రాయితీపై మోటార్ ఇంజన్లు మంజూరయ్యాయి. ఈ మేరకు టిడిపి నాయకులు వాటిని మత్స్యకారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ, ఎంపీడీవో చైతన్య,మండల మత్స్యశాఖ అధికారి శృతి, ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, మెరుగు నాగేశ్వరరావు, మత్స్యకార నాయకులు గోసల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

అందజేస్తున్న టిడిపి నాయకులు

పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే రాజు

కష్టించి పనిచేస్తే తగిన గుర్తింపు

- ఎమ్మెల్యే రాజు - అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో చినపాచీల ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులను చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో సుమారు 52 మంది కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి వచ్చినటువంటి వారికి ఎటువంటి అన్యాయం జరగకుండా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వ్యక్తులకు ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ రాజన కొండనాయుడు, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ కామిటి శంకర్రావు, కోపరేటివ్ అధ్యక్షులు పరదేశి నాయుడు, పాల సంఘం అధ్యక్షులు ఆధాడ రాజారావు, పలువురు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి విజయ

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి విజయ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.చైతన్య ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శద్ద తీసుకొని సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. ప్రతి రోజు చదవడం, రాయడం పై తర్ఫీదును ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కే.నరేష్, నాగన్నదొర, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి- వడ్డాది:కిశోర వికాసం భేటీ బచావో భేటీ పడావో బాల్ వివాహ్ ముక్త్ భారత్ వంద రోజుల కార్యమ్రంలో భాగంగా బుచ్చయ్యపేట మండలం మంగళాపురం, విజయరామరాజుపేట గ్రామాల్లోని పాఠశాలల్లో బాల్య వివాహాలు- అనర్థాలపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు చేపట్టారు. బాల్య వివాహాలు చేయడంతో పలు ఇబ్బందులు సంభవిస్తాయన్నారు. శారీరక ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. బాల్య వివాహాలను చేయరాదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామపెద్దలు, టీచర్లు, వైద్య సిబ్బంది, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహాలకు విద్యుత్ నిలిపి వేయడంపై

కాగడాలతో గిరిజనుల నిరసన

ప్రజాశక్తి:రావికమతం:మండలంలో టి. అర్జాపురం పంచాయతీ పి.కోట్నా బిల్లి గ్రామంలో కొండ దొరకు చెందిన గిరిజనుల ఇళ్లకు విద్యుత్తు వైర్లు కట్ చేయడం ఎంతవరకు సబబని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాడి బెన్నయ్య, ఎన్.రాము, సుంకర అప్పారావు, వంటే గురుమూర్తి, లక్ష్మి తదితరులు ప్రశ్నించారు. శనివారం రాత్రి కాగడాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 11 కుటుంబాలకు చెందిన గిరిజనుల ఇళ్లకు విద్యుత్ నిలిపివేయడంతో రాత్రిపూట చంటి పిల్లలతో, వృద్ధులతో పలు ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. గిరిజనులం అందరం విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్నా కనీసం దయా దాక్షిణ్యం లేకుండా వ్యవహరించడం దారుణమన్నారు. నేటికీ పది సంవత్సరాల నుండి తమకు ఎటువంటి బిల్లులు ఇవ్వలేదని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధిక బిల్లులు రావడంతో చెల్లించలేక పోతున్నామనానరు. తుబే లక్ష్మి విద్యుత్ బిల్లు రూ.1500లు కట్టడం జరిగిందన్నారు. ఇంతవరకు బకాయి పడ్డ పూర్తి బిల్లులు చెల్లించలేదని వైర్లు కట్ చేయడం దారుణమన్నారు. మగవాళ్లు కూలి పని నిమిత్తం వరి కోతలకు వెళ్లడం జరిగిందని, వారు వచ్చిన తర్వాత నాలుగు వాయిదాలలో చెల్లిస్తామని చెప్పామని, గడువు ఇవ్వమని చేతుల జోడించి లైన్ మాన్ ను వేడుకున్నా కనీసం కనికరం లేకుండా వ్యవహరించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండ ప్రాంతాన్ని అనుకొని ఉన్న తమ గ్రామం చిమ్మ చీకట్లో అలమటిస్తుందన్నారు. తమ ఇళ్లకు రెండు బల్బులు, ఒక ఫ్యాన్ మాత్రమే ఉపయోగిస్తున్నామని, అటువంటప్పుడు తమకు ఏ విధంగా బిల్లులు ఇస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. రాత్రి సమయంలో దోమల కాటుకు గురై విష జ్వరాలతో సతమతం అవుతున్నామన్నారు. కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న తమను ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. లేని పక్షంలో గిరిజన ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులతా భారీ ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు.

నిరసన చేపడుతున్న నాయకులు, గిరిజనులు

సాగరంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి- మాడుగుల: సేవ చేయడం ద్వారానే మనిషికి సంతృప్తి కలుగుతుందని మాడుగల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సాగరం పంచాయితీ సాగరం కాలనీలో జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సేవా శిబిరం ఈనెల 12 వరకు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో శాస్త్రి మాట్లాడుతూ, విద్యార్థులు విద్య తో పాటు సామాజిక సేవలో కూడా పాల్గొనాలని, అందుకు ఈ శిబిరం ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థులు ఉత్తమ స్థాయిని, ఉన్నత విలువలు పొందగలుగు తారన్నారు. బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి ఉపయోగపడు తుందన్నారు. అనంతరం కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రీను ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శాస్త్రి

సారా తయారీదారులపై చర్యలు

-ఎక్సైజ్ సిఐ మోహన్‌రావు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న గొలుగొండ, నాతవరం మండలాల్లో ఎక్కడైనా నాటుసారా తయారీ, అమ్మకాలు, రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఎం.మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరైనా నాటుసారా తయారు చేసి విక్రయించినట్లయితే వారిపై బైండోవర్ కేసులు పెట్టి ఆస్తులను కూడా జప్తు చేస్తామన్నారు. గంజాయి రవాణా చేసినా చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా ఉపేక్షించేది లేదన్నారు. నాటుసారా, గంజాయి అక్రమ రవాణా వంటి వాటిపై సమాచారం అందించాలని కోరారు.

2625 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో ఒక రైస్ మిల్లు పరిసరాల్లో నిల్వ ఉంచిన 2625 కేజీల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. యలమంచిలి సివిల్ సప్లై డీటీ రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం ఎస్.రాయవరం మండలం గెడ్డపాలెం గ్రామానికి చెందిన పినపాత్రుని వెంకట సత్యనారాయణ యలమంచిలిలోని ఒక రైస్ మిల్లు యజమానికి చరవాణిలో ధాన్యం ఆడుటకు తీసుకువస్తున్నామని చెప్పి 2625 కేజీల (75బస్తాలు) రేషన్ బియ్యం తెచ్చారు. ఆ బియ్యాన్ని పాలిష్ చేయమని అడుగితే తాము పాలిష్ చేయమని చెప్పి వెనక్కి పంపించారు. దీంతో మిల్లు పరిసరాల్లో ఈ బియ్యాన్ని డంప్ చేసి ఉంచారు. శనివారం అటుగా వెళుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆ డంప్‌ను చూసి పరిశీలించగా అవి రేషన్ బియ్యం అని తేలింది. దీంతో అధికారులకు సమాచారం ఇవ్వడంతో, సివిల్ సప్లై డీటీ విచారణ చేసి, మొత్తం 2625 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని గొడౌన్‌కు తరలించారు. ఆ బియ్యం విలువ రూ.1,26,000 ఉంటుందని డిటి తెలిపారు. నిందితుడు సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ వినయభాస్కర్, వూటకూటి రమేష్, కోటారు శ్రీను మాస్టర్ పాల్గొన్నారు.

నిందితునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ముత్యాలమ్మపాలెం యువతకు ఉద్యోగాలు కల్పించాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ ప్రజలకు, ముఖ్యంగా మత్స్యకార యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఫార్మాసిటీ యాజమాన్యం ఇచ్చిన హామీ ఇంకా అమలు కాలేదని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. శనివారం విశాఖ ఫార్మాసిటీ ఎండి లాల్ కృష్ణను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎన్నోసార్లు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారని, ఆ సమయంలో యువతకు ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ మాటల్లోనే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులను పక్కనబెట్టి బయటి వాళ్లను నియామకాలు చేసి మోసం చేయొద్దని హితవుపలికారు. రాజకీయ జోక్యం లేకుండా స్థానిక యువతకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేకపోతే ప్రజా పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైసిపి నాయకులు బొంది అచ్చిబాబు, గంజి సురేష్, సురాడ మసేను, సురాడ ఎల్లజి, సురాడ నూకరాజు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ ఎమ్‌డి లాల్ కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైసిపి నేతలు